# పాడవేల రాధిక

పూమొక్కల మధ్య రకరకాలుగా వెలుగు నీడలతో దోబూచులాడుతున్న శీతాకాలపు చల్లని ఎండలో సప్తస్వరాలు పలికిస్తున్న వీణలా భాసిస్తోంది నీరజ, బియ్యే.

ఆ అందం చూసేవాళ్ళకి.

కాని నీరజ మనస్సులో మాత్రం ఆమె చుట్టూ విరబూసి వున్న కనకాంబరం పువ్వులు కాషాయ రంగును గుర్తుచేస్తున్నాయి.

నిజానికి నీరజ మధురోహలతో హిందోళరాగంలా తేలిపోవలసిన సాయం సమయ మది. పెళ్ళి వాళ్ళొచ్చారు — నీ చూసి ఎంచుకోడానికి. నీరజను చూడగానే చిన్న రైల్లో నిద్రలేక్కాబోలు బద్ధకంగా మత్తుగా వున్న కథానాయకుని కళ్ళు తళుక్కున మెరిశాయి. పెద్దలక్కా వచ్చిన వస్తువిరుద్ధమైన అంశాల్లో ఎలానూ పెద్ద పేచీ లేదు. (నీరజ తండ్రి, అన్నలు అందరూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఆమె అక్కలకు ఎప్పుడో పెళ్ళిళ్ళయిపోయాయి. ఈమే ఆఖరి ఆడపడుచు ఆ ఇంటికి. ఈ విషయాలన్నీ మధ్యవర్తులు ప్రచారం చేస్తూనే వున్నారు.

అయితేనేం, పెళ్ళిచూపుల్లో ప్రతి ష్టంభన ఏర్పడింది!

ఒకర్నొకరు పరిచయం చేసుకోడాలు, ఫలహార సేవనం, నీరజ చేత సుమతీ శతకం, ఇంగ్లీషు పేపరు చదివించడం, ఛలోక్తులు — అలా సరదాగా ఆశావహంగా - జరిగిన పెళ్ళిచూపుల రాగంలో ఓ అపస్వరం పలికింది - అదీ సంగీతం గురించి!

''అమ్మాయికి సంగీతం చెప్పించారా?''

''బాగా నేర్చుకుందండి. శ్రీమతి సునందా శాస్త్రిగారే నేర్పించారు. సామజ వరగమనా పాడతావా తల్లీ'' మురిపెంగా నీరజను ప్రోత్సహించాడు తండ్రి.

''అంటే! శాస్త్రీయ సంగీతమే! నాకు చాలా ఇష్టం'' అంది అబ్బాయి తల్లి.

నీరజకి ఆనందంతో ఒళ్ళు పులకించింది. 'శంకరాభరణం' సినీమా వచ్చాక శాస్త్రీయ సంగీతానికి ఆంధ్రదేశంలో ఓ అరుదైన గుర్తింపు లభించింది. అంత దాకా కేవలం 'గొప్ప'వాళ్ళ కోసమే కాబోలు శాస్త్రీయ సంగీతం అనుకునే జనం శంకరాభరణం పాటల్ని అందుకుని పరవశించారు. ఆ ఊపులోనే నీరజ తండ్రి ఓ వీణ కొనేసి ఆమెకు శాస్త్రీయ సంగీతం నేర్పించడం జరిగింది.

కాని శంకరాభరణం సినీమాలో 'సామజ వరగమనా' పాట గాయని ఎంత గొప్పగా పాడినా కథ కోసం ఓ అపస్వరాన్ని తెచ్చుకుని పెళ్ళి చూపుల్ని హఠాత్తుగా ఆపేస్తుంది. ఇక్కడా అలాగే జరిగింది.

నీరజ ఇంకా పాట మొదలెట్టకుండానే కుర్రవాని తల్లి కీరవాణిగారు తల ఆడిస్తూ కుర్చీ మీద తాళం వేయడం మొదలుపెట్టి నీరజ 'సామజ' అనగానే ''అమ్మబాబోయ్'' అని కుర్చీలో వాలిపోయింది. ఆవిడకి సెర్వికల్ స్పాండిలోసిస్ రావడమే శాస్త్రీయ సంగీతం ఎక్కువ వినడం వల్ల వచ్చింది. దాంతో డాక్టర్లు, ఇంజక్షన్లు, ఆవిడ మెడకి సపోర్టుగా బెల్టు వచ్చాయి.

కీరవాణిగారికి చిన్నప్పుడు క్లాసికల్ మ్యూజిక్ అంటే అయిష్టం, ఎలర్జీ. కాని ఆవిడ భర్త పెద్ద ఉద్యోగస్తుడవడం, ఖర్చుకి మించిన ఆదాయం సంక్రమించడం వగైరా ఉదాత్త, అనుదాత్త దశలు పట్టడంతో విధిగా ప్రతిగాన కచ్చేరీకి వెళ్ళాల్సిన అవస్థ ఏర్పడింది. వెళ్ళడం ప్రభుత్వ ఖర్చుతో, ప్రభుత్వ డ్రైవర్ నడిపే ప్రభుత్వ కారులోనే అయినా ఆవిడకీ, శాస్త్రీయ సంగీతానికీ ఆకర్ణాంత విశాల వైరం కనుక శిరోవేదన తప్పేది కాదు.

కాని 'స్టేటస్ సింబల్'గా గానసభలు అతుక్కుపోయాయి ఆమెకూ, భర్తకూ.

అంచేత కీరవాణిగారు గానకచేరీలో పాల్గొంటూనే వినకుండా వుండే పద్ధతి కనిపెట్టారు. అదేమిటంటే గానసభలో మిగతా జనాన్ని చూస్తూ, సాటి ఆడవాళ్ళ నగల, చీరల వెలలూ, తాను కొనే అవకాశాలూ అంచనా వేస్తూ, శ్రోతల్లో ఎవరు బాగా పాటకి లయగా తల ఆడిస్తున్నారో చూస్తూ వాళ్ళని అనుకరించడం!

అలా వచ్చింది ఆవిడకు మెడనొప్పి.

ఇప్పుడు పెళ్ళిచూపులకి వెళ్తూ మెడ బెల్ట్ పెట్టుకుంటే ఆవిడ మెడలోని లక్షన్నర చేసే నగల గతి ఏమిటి? అంచేత బెల్ట్ లేకుండానే కీరవాణిగారు వచ్చారు.

అప్పుడప్పుడు మెడ బెల్ట్ లేకపోయినా ఫర్వాలేదని డాక్టర్లూ చెప్పారు. అలాగని ఏదైనా పాట వింటూ, ఎంత నచ్చినా తల ఆడిస్తే డేంజరని కూడా హితవు చెప్పారు.

కాని ఎంతో శ్రమపడి అలవర్చుకున్న ''తలవాటు'' (అదే - తలకి వచ్చిన అలవాటు) ఒక్కసారి పోతుందా!

అంచేత నీరజ 'సామజ వరగమనా' అనే త్యాగరాజ కృతి పాడడం మొదలెట్టగానే కీరవాణిగారు తల తిప్పడం మొదలు పెట్టడం; వెంటనే మెడ దారుణంగా నొప్పి పెట్టి కుర్చీలో వాలిపోవడం శర వేగంతో జరిగిపోయాయి. అది పెద్ద 'అపశకునం'గా కీరవాణిగారి 'పార్టీ' భావించారు, పైకి అనేశారు కూడాను.

అంతలో ప్రభుత్వంవారి దయవల్ల రోజూ విధిగా లభించే కరెంట్ ఫెయిల్యూర్ మొదలై, గదిలో ఫాన్లు, దీపాలు ఆరిపోయాయి. ''అబ్బబ్బా పాడు ఉక్క. అలా గాలిలోకి పోదాం'' అంటూ కీరవాణిగారు మూలుగుతూనే సూచన ఇవ్వడంతో మొగపెళ్ళివారంతా ఏకతాటిమీద నడిచి డాబా ఎక్కారు.

నీరజ షాకైపోయింది.

అందులోనూ సంగీతం ఆమెకు ఆరో ప్రాణం!


పాట అందుకోగానే ఈ అపశ్రుతి!!

ఆమె మనస్సు 'కీడు' శంకించింది. కారణం ఇదివరలో ఎన్నో పెళ్ళి ఇంటర్వ్యూలలో తను నిష్కారణంగా ఫెయిలవ్వడమే.

నీరజ చిన్నన్న చంద్రం వెంటనే రంగంలోకి దిగాడు. నవ్వు నటిస్తూ ''ఇంటర్వెల్! పాప్‌కార్న్ పాప్‌కార్న్ పాప్‌కార్న్... లిమ్కా లిమ్కా లిమ్కా.

హాల్లో సిగరెట్లు కాల్చరాదు. ఎదర కుర్చీలపై కాళ్ళు పెట్టరాదు. మా రాబోయే చిత్రాలు... గాంధారి గర్వ భంగం, మాయాబజార్, కోడలుదిద్దిన అలు...'' అని హుషారుగా ...

'ఇది ముగింపు



# జ్యేష్ఠ కథ

కాదనీ, 'కథ సుఖాంతమేననీ చెల్లెలుకు స్ఫురించేలా నానా అల్లరీ చేసి ఆమెను ఆ ఇంటి చుట్టూ వున్న పూల మొక్కల్లోకి నడిపించి,

"అబ్బాయి ఎలా వున్నాడే" అన్నాడు.

"ఎలా వుంటేనేం... ఈ సంబంధం నా ఆఖరి సంబంధం. కుదిరినా కుదరకపోయినాసరే— వచ్చినా ఈ అవమానాలకు సిద్ధపడను నేను! త్యాగరాజ కృతి విని తలవొప్పి, మెడపోటూ తెచ్చుకొనేవాళ్ళ అది తమ కర్మ అనుకోక నన్ను హేళన చేయడం దేనికి!" అంది నీరజ ఏడుపు ఆపు కుంటూ.

"ఏన్నేమన్నారే?"

"విను నీకే తెలుస్తుంది."

"బాధ కొద్దీ ఆవిడ విసుక్కుం దేమో! సెర్వికల్ స్పాండిలోస్ చాలా హైక్లాస్ జబ్బు తెలుసా! సంగీతాల్లో కర్నాటక సంగీతం ఎలాగో, మెడ నెప్పుల్లో ఇది అంత గొప్పది. అంచేత దాని విసుర్లు దానికుంటాయి. ఇంతకీ నీకు అబ్బాయి నచ్చాడా లేదా."

"నచ్చాడు"

"ఎందుకు నచ్చేడు! చాలా వినయం వందనం వున్నవాడని తెలుస్తూనే వుంది. పతివ్రతా లక్షణాలు పరహోరూ వున్నాయి. అంచేత నువ్వు నిరుత్సాహపడార్సిందేమీ లేదు. ఇక నవ్వు" అని నీరజను నవ్వించి డాబా. మీదున్న పెళ్లి వారి వేపు పరుగెత్తాడు చంద్రం.

అలా దుఃఖాన్ని దిగులుగా దిగజార్చిన నీరజ మూగ వీణలా బంతిమొక్కల పక్కన ముద్దబంతి పువ్వులా కూర్చుని కూని రాగాలు తీయసాగింది.

అదే సమయంలో తమ ఇంట్లోనే అద్దెకుంటున్న పంచాంగాల సిద్ధాంతి గారు రాబోయే సంవత్సరపు పంచాంగం లెక్కలు చేస్తూ కూనిరాగం తీస్తూండడం ఆమె చెవిన పడింది.

తన దిగులు మర్చిపోవడానికని కాబోలు ఆయన కూని రాగాన్ని శ్రద్ధగా వినసాగింది నీరజ.

ఫక్కున నవ్వింది నీరజ.

ఎందుకంటే సిద్ధాంతి గారు రోజూ మూడు సంధ్యలా సహస్ర గాయత్రి జపించేవాడు. ఆయనలో అంతకి మించిన ఆధునికత లేదనుకుంటే పొరపాటు. ఆయన ఒక సరికొత్త ప్రజాదరణీయ ట్యూన్‌ని హమ్ చేస్తున్నాడు—పంచాంగం రాస్తూ!

విరగపడి నవ్వింది నీరజ. యుగ యుగాలుగా మూఢ నమ్మకాల మట్టి దిబ్బల్లో కూరుకపోయిన స్త్రీలు సరోజినీనాయుడు, ఇందిరా గాంధీ- ప్రభృత వీర మహిళల ఆదర్శాన్ని స్వీకరించి వెలుగులోకి వస్తుం వాళ్ళని కప్పి వుంచినే మట్టి దిబ్బలు విరిగి పడినట్లుగా ఆమెలో గత కొద్ది గంటలుగా అణిగి పడి వున్న సహజ ప్రతిభ, యుక్తి, హాస్య ప్రియత్వం బయట పడ్డాయి.

అదే క్షణంలో కరెంట్ వచ్చేసింది. ఆరిన దీపాల ముఖాలు వెలిగాయి. బిక్కు బిక్కు మంటున్న ఫాన్లు గిర్రున తిరిగాయి. డాబా మీంచి దిగి వచ్చారు పెళ్ళివారు.

మళ్లీ పెళ్ళి మాపులు.

కీరవాణి గార్ని ట్రీట్ చేయడానికి వచ్చిన డాక్టరు "మళ్ళీ రెండు రోజుల వరకు క్లాసికల్ మ్యూజిక్ మాత్రం వినకండి" అనేసి వెళ్ళిపోయాడు.

సిగ్గుతో కీరవాణి గారి మొహం ఎర్రగా కందిపోయింది. "నాకేం భయం లేదు. ఎన్ని పాటలేనా వినగలను. వారానికి మూడు గాన కచేరీలకి వెళ్ళేదాన్ని. నా కల్చర్ మూడు జన్మలెత్తినా రాదు ఈ డాక్టర్లకి. హే" అని ముక్కు పుటాలెగ రేసింది ఆవిడ.

"ఇందాక పాట ఆపేశావు. ఇప్పుడు పాడేయమ్మా" అంది అబ్బాయి పెద్దక్క.

"క్లాసికల్ అస్తమానూ విని మొహం మొత్తి వుంటుంది మీకు! ఈ సారి ప్రజలందరూ మెచ్చే పాటలు పాడ తానండి."

"అలాగే చేయవమ్మా. పదుగురాడు మాట పాడియై ధర చెల్లు అన్నాడు వేమన. తన కవిత్వం జాతి జనులు పాడే పాట, మార్నింగ్ సాంగ్ కావాలని కలగన్నాడు శ్రీ శ్రీ. నీ పాట అందరికీ తెలిసి వుండాలి. విని వెంటనే కూడా పాడ గలిగే సౌలభ్యం వుండాలి. మహాకవి గురజాడ గురించి రాస్తూ కృష్ణ శాస్త్రి

ముక్కలన్నియు సొక్కి సోలెను/గిరులు కదలెను, తిరుగ పాడెను/ లోక మోహన మధుర గానా/ స్వాద మోదమున" అన్నారు. అలాంటి పాట పాడు చెల్లీ" అని ఉషారిచ్చాడు చంద్రం.

నీరజ 'అలాగేనన్నట్లు తల ఆడించి

గురజాడ వారి

"దేశమును ప్రేమించు మన్న" అనే పాట అందుకుంది. పాడు తూనే ఓరగంట ఎదుటివాళ్ల రియాక్షన్స్ గమనించడం మంచి దైంది. అందరూ ఇబ్బందిగా కుర్చీల్లో మెలికలు తిరుగుతున్నారు. అంచేత రెండు చరణాలు మర్యాదకి పూర్తి చేసి ఊరుకుంది.

తర్వాత శ్రీ శ్రీ గారి "శైశవ గీతి", దాశరథిగారి "మాట్లాడని మల్లె మొగ్గ" పాటలు పాడింది కాని అవీ మొగ పార్టీ వాళ్ళకి నచ్చలేదని గమ నించింది నీరజ.

ఓ క్షణం ఆలోచించింది. పంచాంగం సిద్ధాంతిగారు రేడియో, టీవీల్లో వచ్చే సరికొత్త పాట కూని రాగం తీయడం గుర్తొచ్చి ఆమెకు నవ్వు పొంగి వచ్చింది. "ధైర్యే సాహసే లక్ష్మీ" అని పెద్దలు చెప్పడం గుర్తు తెచ్చుకుంది.

మనస్సులోనే నడుం బిగించి, ఠీవిగా తలపైకెత్తి టీవీలో రోజూ వచ్చే బట్టల సబ్బు పాట ఒకటి మొదలెట్టింది. వాళ్ళకి నచ్చకపోతే మానెయ్యాలనుకుంటూ.

కానీ నీరజ ఆ బట్టల సబ్బు పాట మొదలెట్టగానే మిగతా వాళ్లందరూ "దాని నురగ చేసిన మాయా జాలానికి" కుర్చీల మీద, బల్లల మీద, తమ తొడల మీద తాళం వేయసాగారు.

అలా కుదిరిపోయింది నీరజ పెళ్ళి. ●

